సాక్షి
వికారాబాద్

సోమవారం । 8 । జనవరి । 2024



'సాక్షి' స్పెల్‌బీ

'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో ఆదివారం స్పెల్ బీ సెమీ ఫైనల్ రౌండ్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. 8లో▸



పింఛన్ ఇస్తలేరు

ఆసరా పింఛన్ సకాలంలో రాకపోవడంతో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



కంపు.. కంపు

పరిగి బస్టాండ్ ఆవరణ అపరిశుభ్రత వల్ల కంపుకొడుతోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన మల్లేశ్‌యాదవ్



బొంరాస్‌పేట: దుద్యాల మండల పరిధిలోని హకీంపేటకు చెందిన ప్రముఖ విద్యావేత్త మల్లేశ్ యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సీఎంగా రేవంత్ పాలన నెల రోజులు పూర్తయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగంలో తనవంతు సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నానని సీఎంకు తెలియజేశామన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంతోపాటు అన్ని రంగాల్లో రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

నమ్మకద్రోహులను వదిలిపెట్టం

- పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటుతాం
- తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



తాండూరు: బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన తాండూరులో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని రహస్యంగా ఎవరు కలిశారనేది త్వరలో వెల్లడిస్తామన్నారు. తాండూరు, వికారాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి గిఫ్ట్‌గా ఇస్తానని రేవంత్‌రెడ్డితో చెప్పింది ఎవరు.. పార్టీ అధిష్టానానికి అన్ని విషయాలు తెలుసన్నారు. సమయం వచ్చినప్పుడు పార్టీ పెద్దలు మాట్లాడుతారన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలుపై దృష్టి సారించకుండా స్కామ్‌లపైనే దృష్టి సారించిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల అమలులో తడబడుతోందన్నారు. ఇప్పటివరకు రైతుబంధు సాయం, ఆసరా పింఛన్లు కూడా పూర్తిస్థాయిలో అందించలేదని ఆరోపించారు. భవిష్యత్‌లో జరిగే పార్లెమెంట్, ఇతర ఎన్నికల్లో గులాబీ పార్టీ సత్తాచాటుతామన్నారు.

స్టాక్ డెలివరీపై గ్యాస్ డీలర్ల అప్రమత్తత అవసరం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్యాస్ డీలర్లు తమ గిడ్డంగితో పాటుగా స్టాక్ డెలివరీపై కన్నేసి ఉంచాలని లేదంటే అక్రమాలు జరిగే అవకాశం ఉందని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన సాగర్ రోడ్డులో గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్న పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. గ్యాస్ డీలర్లు ఏమాత్రం ఏమరుపాటుగా ఉండొద్దని సూచించారు. ఇటీవల ఐశ్వర్య గ్యాస్ ఏజెన్సీ నుంచి పెద్ద మొత్తంలో బండలు రీఫిల్లింగ్ మాఫియాకు చేరిన సంగతి గుర్తు చేశారు. గ్యాస్ డీలర్లు రోజువారీగా గిడ్డంగిలోని నిల్వలు, సరఫరా వంటి అంశాలను ఆరా తీయాలని సూచించారు. చమురు కంపెనీలు గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏ మాత్రం జాప్యం చేయనప్పటికీ, డీలర్ల పర్యవేక్షణ కొరవడడం వల్లే కొందరు వినియోగదారులకు గ్యాస్ సకాలంలో చేరడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వినియోగదారులకు సేవలో డీలర్లు విఫలమైతే చర్యలుంటాయన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

షాద్‌నగర్: పార్టీని గ్రామ స్థాయి నుంచి పటిష్టం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జంగయ్య మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంతోనే పేదలకు, కార్మిక వర్గానికి మేలు జరుగుతుందని సూచించారు. నియోజవర్గంలో పార్టీ సభ్యత్వాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పర్వతాలు మాట్లాడుతూ... గ్రామ స్థాయిలో పార్టీని విస్తరించేందుకు అవకాశాలు ఉన్నందున కార్యకర్తలు తగిన చొరవ చూపాలన్నారు. నాయకులు శ్రీను, వెంకటేశ్, గోవింద్, షకీల్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండింతల దరఖాస్తులు

ముగిసిన ప్రజాపాలన కార్యక్రమం

- జిల్లాలో 1,94,956 కుటుంబాలకు గాను 3,14,090 దరఖాస్తులు
- ఐదు గ్యారంటీలకు తోడు ఇతర సమస్యలపై భారీగా అర్జీలు
- డాటా ఎంట్రీ పనులను పర్యవేక్షించిన కలెక్టర్
- అనుమానాలుంటే దరఖాస్తుదారుడికి కాల్ చేయాలని ఆదేశం



డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచనలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గత పది రోజులుగా (ఎనిమిది పనిదినాల్లో) గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో నిర్వహించిన అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారం (జనవరి 6)తో ముగిసింది. ప్రజలనుంచి అనుకున్న దానికంటే ఎక్కువగానే దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని మొత్తం 18 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. వీటి పరిధిలోని 566 గ్రామ పంచాయతీలు, 97 మున్సిపల్ వార్డుల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలతో పాటు ఇతర సమస్యలకు సంబంధించి కూడా దరఖాస్తులు స్వీకరించారు.

తాండూరులో అత్యధికం..

జిల్లాలో మొత్తం 1,94,956 కుటుంబాలు ఉండగా 3,14,090 అభయహస్తం దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఐదు గ్యారంటీలకు సంబంధించి 2,74,470 దరఖాస్తులు రాగా.. రేషన్ కార్డులు, భూమి తదితర ఇతర సమస్యలకు సంబంధించి 39,620 దరఖాస్తులు వచ్చాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మొదలు రేషన్ కార్డులు ఇవ్వకపోవటం, ధరణికి సంబంధించి వేల సంఖ్యలో సమస్యలు పేరుకుపోవటం తదితర కారణాలతో ఇతర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సైతం గణనీయంగా వచ్చాయి. ఐదు గ్యారంటీలకు సంబంధించి తాండూరు మున్సిపాలిటీలో అత్యధికంగా 17,065 అర్జీలు వచ్చాయి. ఇదే సమయంలో వికారాబాద్ మున్సిపాలిటీ, దోమ, బొంరాస్‌పేట్‌లో అత్యధికంగా 16వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. కొడంగల్ మున్సిపల్ పరిధిలో అత్యల్పంగా 3,414 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఇతర సమస్యలకు సంబంధించి తాండూరు మండలంలో అత్యధికంగా 4,045 దరఖాస్తులు రాగా బషీరాబాద్ మండలంలో అత్యల్పంగా 8 దరఖాస్తులు వచ్చాయి.

డాటా ఎంట్రీపై దృష్టి...

శనివారంతో గడువు ముగియటంతో అధికారులు ప్రస్తుతం వచ్చిన దరఖాస్తుల్లో పొందుపర్చిన డాటాను కంప్యూటర్లలో ఎంట్రీ చేయటంపై దృష్టి సారించారు. ఒకవైపు జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుండగానే శుక్రవారం నుంచే డాటా ఎంట్రీ ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కలెక్టర్ నారాయణరెడ్డి డాటా ఎంట్రీ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. డాటా ఎంట్రీకి సంబంధించిన విధివిధానాలు వారికి వివరించారు. ఈ ప్రక్రియను సకాలంలో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. మొత్తం మూడు లక్షల పై చిలుకు దరఖాస్తులు వస్తాయని అంచనా వేసిన అధికారులు తదనుగుణంగా ఏర్పాట్లు పూర్తిచేశారు. దరఖాస్తులను వెబ్‌సైట్లో నమోదు చేసేందుకు జిల్లాలో 57టీంలు ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో 20 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఉండగా వారు పదిమంది చొప్పున రాత్రి,పగలు రెండు షిఫ్టుల్లో పనిచేయనున్నారు. ఈనెల 17లోగా డాటా ఎంట్రీ పూర్తిచేసే విధంగా చర్యలు చేపడుతున్నారు.

ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఎక్కిస్తాం



ప్రజాపాలనలో భాగంగా జిల్లాలో మొత్తం 3,14,090 దరఖాస్తులు వచ్చాయి. డాటా ఎంట్రీలో ఒక్క దరఖాస్తు కూడా మిస్ అవకుండా చర్యలు తీసుకుంటున్నాం. డాటా ఎంట్రీ చేసిన ఆపరేటర్ ఆ దరఖాస్తు ఫారం చివరలో తప్పనిసరిగా సంతకం చేయాలి. ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తులు మొత్తం వెబ్‌సైట్‌లోఎక్కిస్తాం. డాటా ఎంట్రీ సమయంలో దరఖాస్తులో ఏమైనా డౌట్ వస్తే అందులో రాయబడిన దరఖాస్తు దారుడికి కాల్‌చేసి అవసరమైన వివరాలు తీసుకోవాలని ఆపరేటర్లకు సూచించాం. పకడ్బందీగా ప్రక్రియను పూర్తిచేస్తాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్, వికారాబాద్



ఇస్తెమాకు హాజరైన ముస్లింలు

కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలి

- మౌలానా జెన్‌షాద్‌సాబ్
- పరిగి ఇస్తెమాకు భారీగా తరలివచ్చిన ముస్లింలు

పరిగి: పరిగి పట్టణ కేంద్రంలోని న్యామత్‌నగర్‌లో 'తబ్లీగీ జమాత్ ఇస్తెమా' ఆదివారం(రెండో రోజు) కొనసాగింది. ఇస్తెమాకు మూడు లక్షలకు పైగా ముస్లింలు తరలివచ్చారు. 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇస్తెమా ప్రాంగణానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి భారీగా ముస్లింలు తరలివచ్చారు. వేదికపై నుంచి ముస్లిం మత పెద్దలు, వక్తలు ప్రసంగించారు. తోటివారికి సహాయం చేయాలని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని కోరారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ ముస్లిం మతపెద్దలు మౌలానా జెన్‌షాద్‌సాబ్, బాయి మూర్సావలిన్, మౌలానా ఫారుక్, ముఫ్తీ ముస్లింలు ప్రసంగించారు. 300 ఎకరాల్లో దాదాపుగా ఐదు లక్షల మంది ఒకేసారి నమాజ్ చేసేందుకు ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఇస్తెమా ఏర్పాట్లను పరిశీలించారు. ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇస్తెమా నిర్వహణకు ప్రభుత్వం రూ.2.4కోట్ల నిధులను మంజూరు చేసిందని.. నిరంతర విద్యుత్ సరఫరా, మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేస్తుందన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇస్తెమాకు వచ్చే ముఖ్యులతో చర్చించి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. దాదాపు 600 మంది పోలీసులు బందోబస్తులో ఉన్నారు. మూడో రోజు ఇస్తెమాకు మరింత మంది హాజరయ్యే అవకాశం ఉంది.

కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాఘవన్



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవన్ నాయక్

అనంతగిరి: కబడ్డీ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రాఘవన్ నాయక్ రెండోసారి ఎన్నికయ్యారు. వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉషిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని 20 మండలాల ప్రతినిధులతో కలిసి జిల్లా అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఉపాధ్యక్షుడిగా మాణిక్యం, రాజు, విజయ్, ప్రధాన కార్యదర్శిగా సుభాష్ నాయక్, జాయింట్ సెక్రటరీలుగా రవి, గణేశ్, కోశాధికారిగా చందర్, కార్యవర్గ సభ్యులుగా హీరాబాయ్, కవిత, ప్రమీల, భానుపవార్, రవినాయక్, మహేష్ జాదవ్, ఆనంద్‌కుమార్, పాండును ఎన్నుకున్నారు. రాష్ట్ర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి 'మంగళం'

- గత ప్రభుత్వ పథకాన్ని రద్దు చేసిన కాంగ్రెస్
- కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం
- అభయహస్తం దరఖాస్తుల ద్వారా లబ్ధిదారుల ఎంపిక!

దౌల్తాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్‌బై చెప్పింది. పథకాన్ని రద్దుచేస్తూ తాజాగా జీఓ జారీచేసింది. దీంతో ఎన్నికలకు ముందు జారీచేసిన ప్రొసీడింగ్‌లు రద్దయ్యాయి. తాజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరుతో ఇళ్ల నిర్మాణానికి సహాయం అందించనుంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను గృహలక్ష్మి పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల సాయాన్ని అందించడానికి గత ప్రభుత్వం నిధులను కేటాయించింది. ఒక్కో నియోజకవర్గంలో 3వేల ఇళ్ల నిర్మాణానికి సాయం అందించాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి గుట్టు చప్పుడు కాకుండా జిల్లాలో పదివేలకు పైగా ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఎన్నికల తేదీ ఖరారు అయిన తర్వాత కూడా కాపీలను లబ్ధిదారులకు అందించారు. ఇప్పుడు అవి చెల్లుబాటు కాకపోవడంతో లబ్ధిదారులు ఉసూరుమంటున్నారు.

మరలా దరఖాస్తు..

తాజాగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన గత ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకం కంటే ఇందిరమ్మ ఇంటికే ఎక్కువ సాయం అందనుంది. అందువల్ల గతంలోని ప్రొసీడింగ్‌ల ద్వారా సాయం పొందడం కంటే కొత్తగా ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం మంజూరు చేయించుకుని లబ్ధి పొందడం మంచిదనే భావన కలుగుతుంది. దీంతో గృహలక్ష్మి కింద లబ్ధిదారులుగా ఎంపికైన వారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సాయం పొందడానికి మరోసారి అభయహస్తం దరఖాస్తులు సమర్పించారు.

ప్రభుత్వం రద్దు చేసింది

గత ప్రభుత్వంలో గృహలక్ష్మి పథకంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. తాజాగా ఆ పథకాన్ని నూతన ప్రభుత్వం రద్దు చేసింది. దాని స్థానంలో ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశాలు ఉన్నాయి.

– తిరుమల స్వామి, ఎంపీడీఓ



ప్రాజెక్టు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు, (ఇన్‌సెట్‌లో) ఫొటోలు దిగుతున్న యువత



సందడి@ కోట్‌పల్లి

కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలను ఆస్వాదించేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఫారెస్టు అధికారులు ప్రాజెక్టు వద్దకు ఎవరినీ రాకుండా దాదాపు ఏడాదిపాటు అడ్డుకున్న విషయం తెలిసిందే. గత డిసెంబర్ 30న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇక్కడ పర్యాటకుల రాకపోకలను తిరిగి ప్రారంభించారు. దీంతో ప్రాజెక్టు, చుట్టుపక్కల అటవీ అందాలను వీక్షించేందుకు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. బోటింగ్ వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగి ఎంజాయ్ చేశారు. – ధారూరు:

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమ్మదనం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జనవరి 15 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్‌తో పాటు ఐఐటీ, నీట్‌కు ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు.

పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్



సస్పెన్షన్‌కు గురైన ఇన్‌స్పెక్టర్ సతీశ్

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సతీశ్ బాధ్యతలు చేపట్టి ఆరు నెలలు గడవక ముందే భూ వివాదంలో తలదూర్చారనే ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు. 2004 బ్యాచ్‌కు చెందిన సతీశ్ 2023 జూన్ 14న పహాడీషరీఫ్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఆరు మాసాల్లో స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల అంశం, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలోనే కొనసాగింది. కానీ అధికార పార్టీ రాష్ట్ర స్థాయి నేతకు సంబంధించిన భూ వివాదంలో తలదూర్చారనే ఆరోపణల నేపథ్యంలో రాచకొండ సీపీ విచారణ చేపట్టి సస్పెండ్ చేశారు. ఈ వివాదంలో ఇన్‌స్పెక్టర్ మాత్రమే ఉన్నారా...? మరెవరైనా ఉన్నత స్థాయి అధికారులు ఉన్నారా అని స్థానికంగా చర్చలు సాగుతున్నాయి.

ఏడాది గడవకుండానే..

రెండు నుంచి మూడేళ్లపాటు విధులు నిర్వహించాల్సిన ఎస్‌హెచ్‌ఓలు పహాడీషరీఫ్ పీఎస్‌లో మాత్రం ఏడాది కూడా పనిచేయడం లేదు. రకరకాల కారణాలతో బదిలీలు, సస్పెండ్ అవుతున్నారు.

- 2020 జూలై 23న సీఐగా బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్‌రెడ్డి ఏడాది తిరగకుండానే 2021 జూలై 15న అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు.
- 2021 ఆగస్టు 4న బాధ్యతలు చేపట్టిన సి.వెంకటేశ్వర్లు 14 నెలలు పనిచేసి 2022 అక్టోబర్ 4న అకస్మాత్తుగా బదిలీ అయ్యారు.
- అక్టోబర్‌లో బాధ్యతలు చేపట్టిన కిరణ్ కుమార్ 2023 మార్చిలో రాజకీయ ఫిర్యాదులతో బదిలీ అయ్యారు. మూడు నెలల పాటు డీఐ కాశీ విశ్వనాథ్ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓగా కొనసాగారు.



పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్

- 2023 జూన్ 14న బాధ్యతలు చేపట్టిన సతీశ్ ఆరు నెలలు గడవక ముందే భూ వివాదం ఆరోపణలతో 2024 జనవరి 7న సస్పెండ్ అయ్యారు.

స్నేక్ గ్యాంగ్ ఉదంతం నుంచి

స్నేక్ గ్యాంగ్ లాంటి ఉదంతంతో రాష్ట్ర వ్యాప్తంగా మార్మోగిన పహాడీషరీఫ్ పీఎస్‌పై పోలీసు ఉన్నతాధికారుల ప్రత్యేక నిఘా ఉంటుంది. ఒక వైపు హత్యలు, హత్యాయత్నాల లాంటి నేరాలకు ఆస్కారం ఉండడం.. ఆపై నగర శివారు కావడంతో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగుతున్న ఈ ఠాణా పరిధిలో విధి నిర్వహణ కత్తిమీద సాములాంటిదే. పై స్థాయి అధికారుల ఆదేశాల కోసం భూ వివాదాలలో తలదూర్చి స్థానిక పోలీసులు తమ మెడకు చుట్టుకున్న సందర్భాలు సైతం గతంలో వెలుగు చూశాయి. ఏదేమైనా తరచూ ఎస్‌హెచ్‌ఓలు మారుతుండడంతో నేరాల నివారణ, ఈ ప్రాంతంపై పట్టు సాధించడం కొత్తగా వచ్చిన అధికారులకు ఇబ్బందికరంగా మారుతోంది.

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

- తెలంగాణ కబడ్డీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పరుశురాం నాయక్



క్రీడాకారులతో జిల్లా ఫెడరేషన్ అధికారులు

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం నైపుణ్యాన్ని సాధించాలని తెలంగాణ కబడ్డీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పరుశురాం నాయక్ అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలో అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ సెలక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యకమానికి హాజరైన పరుశురాం మాట్లాడుతూ... గ్రామీణ యువత, విద్యార్థులు కబడ్డీలో ఎక్కువగా రాణిస్తుంటారని అందులో భాగంగా జిల్లా జట్టు ఎంపికకు గ్రామీణ క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ జరిగే పోటీల్లో జిల్లా బాలుర, బాలికల జట్టును ఎంపిక చేస్తామని.. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో వికారాబాద్ జిల్లా జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు మాట్లాడుతూ... విద్యార్థులు, యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా వస్తాయని అన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన రాజేందర్‌ను అతిథులు సన్మానించారు. ప్రతిభచాటిన క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ ఫెడరేషన్ నాయకులు వినోద్‌కుమార్, నరేందర్ నాయక్, రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సువర్ణావకాశం 'సాక్షి' స్పెల్‌బీ

- 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహణ
- నాలుగు జిల్లాల నుంచి పాల్గొన్న 600 మంది విద్యార్థులు
- సెమీఫైనల్ రౌండ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు


'సాక్షి' స్పెల్ బీలో పాల్గొన్న విద్యార్థులు


కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

దుండిగల్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేటలోని శిఖర స్కూల్‌లో 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో ఆదివారం 'స్పెల్ బీ' సెమీ ఫైనల్ రౌండ్ కాంపిటీషన్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆరు కేటగిరీల వారీగా పోటీలు నిర్వహించారు. ఇందులో రంగారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన 70 పాఠశాలలకు చెందిన దాదాపు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీతత్వాన్ని పెంచే విధంగా ఇలాంటి పోటీలు నిర్వహించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు 'సాక్షి' యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు..

డ్యూక్స్ వెఫి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమండ్రి సౌజన్యంతో 'సాక్షి' మీడియా గ్రూపు నిర్వహించిన ఈ స్పెల్ బీ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కాంపిటీషన్ అనంతరం తాము పరీక్షలో ఏ విధంగా పాల్గొన్నాం.. ఎన్ని ప్రశ్నలకు జవాబులు రాశామో చర్చించుకుంటూ తల్లిదండ్రులతో ఆనందంగా పంచుకోవడం కనిపించింది. ఈ కార్యక్రమంలో తమ పిల్లల చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, సాక్షి యాజమాన్యానికి కృతజ్ఞతలు అంటూ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.


పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ఐయామ్ వెరీ హ్యాపీ..



నేను గాజుల రామారంలోని తత్వ స్కూల్‌లో సెవెన్త్ క్లాస్ చదువుతున్నాను. గతంలో నిర్వహించిన పోటీల్లోనూ పాల్గొన్నాను. పై రౌండ్‌కు అర్హత సాధించడంతో నాలో ఆత్మవిశ్వాసం వచ్చింది. మరో సారి పాల్గొనేందుకు వచ్చాను. స్పెల్ బీ, మ్యాథ్స్ బీకి అర్హత సాధించడంతో ఐయామ్ వెరీ హ్యాపీ.

– త్రిషికేశ్, విద్యార్థి

SAKSHI SPELL Bee 2023-24

SAKSHI · సాక్షి · SAKSHI DIGITAL · MEDIA GROUP

ఇది సూపర్బ్ ప్రోగ్రాం



'సాక్షి' నిర్వహించిన స్పెల్ బీ పరీక్షలో 98 శాతం అన్ని కరెక్ట్‌గా రాశాను. ఇది సూపర్బ్ ప్రోగ్రాం అని చెప్పొచ్చు. మొదటగా ఎల్‌బీ నగర్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని అర్హత సాధించాను. దీంతో రెండవ సారి పాల్గొనడానికి ఇక్కడకి వచ్చాను. అందరూ సహకరించారు. – తండ్రితో అబ్దుల్ రెహమాన్, విద్యార్థి

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థులకు సాక్షి స్పెల్ బీ సువర్ణావకాశం. మేం చిన్నతనంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నాం. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే విధంగా 'సాక్షి' చేపట్టిన ఈ కార్యక్రమం అద్భుతం. వారిలో నేర్చుకోవాలనే తపన పెరుగుతుంది. ఇక్కడికి నా కూతురును తీసుకురావడం చాలా సంతోషంగా ఉంది.

– నర్మద, విద్యార్థిని తల్లి, మహబూబ్‌నగర్

ఎన్నో విషయాలు నేర్చుకున్నా..



స్కూళ్లలో చెప్పే ఇంగ్లిష్‌కు.. ఇక్కడ స్పెల్ బీలో ఉపయోగించిన ఇంగ్లిష్‌కు చాలా తేడా ఉంటుంది. ఇంగ్లిష్ పదాలను ఎలా ఉచ్చారణ చేయాలో నేర్చుకున్నా. స్కూల్‌లో పాల్గొన్న పోటీల కంటే ఇక్కడ పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది.

– శాన్వి జోషి, విద్యార్థిని, నాచారం

సాక్షి మీడియాకు థ్యాంక్స్



విద్యార్థుల్లో నూతనోత్సాహం పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. పిల్లల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు ఇతర పాఠశాలల విద్యార్థులను కలుసుకోవడం, వారితో అభిప్రాయాలను పంచుకోవడం మంచి శుభపరిణామం. 'సాక్షి' మీడియాకు కృతజ్ఞతలు.

– ప్రణీత్, పేరెంట్, మదీనాగూడ..

పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



ముందుగా 'సాక్షి' యాజమాన్యానికి మా శిఖర పాఠశాల నుంచి ప్రత్యేక కృతజ్ఞతలు. స్పెల్ బీ, మ్యాథ్స్ బీలను నిర్వహించడం ద్వారా పిల్లల్లో ఆత్మ స్థైర్యం పెరుగుతుంది. ఇంగ్లిష్‌లో మంచి పట్టు సాధిస్తారు. లెర్నింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వారి తల్లితండ్రులకు కూడా అభినందనలు. – శ్రేయ, శిఖర స్కూల్ ప్రతినిధి

క్లుప్తంగా

పాము కాటుతో వ్యక్తి మృతి


బాబు(ఫైల్)

దోమ: పాము కాటుకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి బడేంపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెద్దింటి బాబు(42) పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో శనివారం రాత్రి ఓ పాము అతన్ని కాటు వేసింది. విషయం కుటుంబ సభ్యులకు తెలపగా.. బాబును దిర్సంపల్లిలోని ఓ వ్యక్తి వద్దకు తీసుకెళ్లి పాము కాటు విరుగుడుకు మందులు తీసుకున్నారు. తిరిగి ఇంటికి రాగా, అర్ధరాత్రి సమయంలో పాము కాటు వేసిన చోట నొప్పిగా ఉందని బాధితుడి చెప్పగా.. తిరిగి దోమ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య అమృతమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ
నలుగురికి గాయాలు


ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

కొడంగల్ రూరల్: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరో నలుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మండల పరిధి ఉడిమేశ్వరం గ్రామ స్టేజ్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కస్తూర్‌పల్లి గ్రామానికి చెందిన హజీమొద్దిన్ తన బంధువుతో బైక్‌పై తాండూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బొంరాస్‌పేట మండలం చిల్‌ముల్‌మైలారం గ్రామం నుంచి చెంగోల్‌కు వెళ్తున్న అనంతయ్య, అశోక్, రాయప్పల బైక్.. హజీమొద్దిన్ బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో హజీమొద్దిన్ కాలు విరిగి, తలకు తీవ్రగాయాలయ్యాయి. మరో నలుగురికి స్వల్పగాయాలు కాగా.. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హజీముద్దీన్‌కు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ సేవలకు అవార్డు


అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందుకుంటున్న సుధాకర్

పూడూరు: జిల్లా సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు, పూడూరు మండలం సర్వేయర్ అరిగె సుధాకర్ జాతీయ బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం అవార్డు సెలక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీలో అందజేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవలు అందించినందుకు ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. ఫిబ్రవరి 11న తిరుపతిలో జరిగే కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్‌పీ తెలంగాణ అధ్యక్షుడు గౌతం, నాయకులు వెంకట్, చంద్రకాంత్, పందీప్, సంపత్, జూనస్, ఇటూ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

ఉప్పల్: అభం శుభం ఎరుగని బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని నివాసం ఉంటున్న బాలిక స్థానికంగా ఓ స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. ఈ నెల 3వ తేదీన స్కూల్ నుంచి ఇంటికి వెళ్లడానికి ఉప్పల్ బస్‌స్టాప్‌లో వేచి ఉంది. దీన్ని గమనించిన స్థానికంగా కట్టె మిషన్‌లో పనిచేసే పాతబస్తీకి చెందిన షేక్ సాదక్ (60) బాలికతో మాటలు కలిపి 'మీ అమ్మానాన్నలు నాకు తెలుసు.. మీ ఇంటికి తీసుకెళ్తాను' అని చెప్పి నమ్మించి వెంటతీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తప్పించుకుని ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు విషయం చెప్పింది. దీంతో తల్లిదండ్రులు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన వారు సీసీ ఫుటేజీల ఆధారంగా వృద్ధున్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. బాధితురాలిన వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పింఛన్ ఇస్తలేరు..

సర్పంచ్ ఇంటి ఎదుట భైఠాయింపు


సర్పంచ్ ఇంటి ఎదుట భైఠాయించిన లబ్ధిదారులు

కుల్కచర్ల: ప్రభుత్వం ఇచ్చే ఆసరా పింఛన్ సకాలంలో రాకపోవడంతో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు సర్పంచ్ ఇంటి ఎదుట భైఠాయించారు. పింఛన్ పంపిణీలో ప్రతి నెలా జాప్యం జరుగుతోందని, ఏదో ఒక కారణం చెబుతూ పోస్టాఫీసు అధికారులు తిప్పుతున్నారని, ఈ నెల కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదని సర్పంచ్ ప్రమీలకు తమగోడు వినిపించారు. దీంతో స్పందించిన సర్పంచ్.. తపాలా సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి


ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తా నని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం మీర్‌పేట జిల్లెలగూడ స్వాగత్ గ్రాండ్‌లో బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నార్ల శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని చెప్పారు. ఆర్యవైశ్యుల కోరిక మేరకు నియోజకవర్గంలో ఇప్పటికే వాసవీమాత దేవాలయ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించానని, అదే విధంగా బడంగ్‌పేట ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. మహేశ్వరం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. నాయకులు తెరేటిపల్లి శ్రీనివాస్‌గుప్తా, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, కార్యదర్శి అర్థం లక్ష్మయ్యగుప్తా, జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగుప్తా, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, బాలాపూర్ మండల ప్రధాన కార్యదర్శి మురళీధర్, కోశాధికారి మంచెన ప్రేమ్‌కుమార్‌గుప్తా, మీర్‌పేట మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఇరుకున పెడుతున్న ఇరుకు రోడ్డు

ఇరుకు దారి వాహనదారులను భయాందోళనకు గురిచేస్తోంది. నిత్యం రద్దీగా ఉండి, ప్రమాదాలకు నిలయంగా మారిన ఎర్రకుంట ప్రధాన రోడ్డులో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాహన చోదకులతో పాటు పాదచారులు కలవర పడుతున్నారు. గత ప్రమాదాలను తలచుకుంటూ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- విస్తరణకు నోచుకోని ఎర్రకుంట ప్రధాన రహదారి
- పట్టించుకోని అధికార యంత్రాంగం


ఎర్రకుంట రహదారిలో ఏర్పడిన గుంతలు

పహాడీషరీఫ్: ఎర్రకుంట రోడ్డు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రధాన మార్గం. సహజంగానే వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. రద్దీ దృష్ట్యా కొంత కాలం క్రితం ఈ రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఎర్రకుంట మర్రి చెట్టు నుంచి బార్కాస్ ఫీలి దర్గా వరకు ఉన్న కిలోమీటర్ దూరం విస్తరణకు నోచుకోలేదు. ఫలితంగా ఇక్కడ తరచూ ట్రాఫిక్ జాం కావడంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఎర్రకుంట చౌరస్తా నుంచి పెట్రోల్ బంక్ సమీపంలోని మర్రి చెట్టు వరకు రోడ్డు మలుపులుగా ఉండడంతో ప్రమాదాల సంఖ్య ఎక్కువగా నమోదవుతోంది. ఇదే విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కిలో మీటర్ మేర రోడ్డు విస్తరణ చేపట్టకపోవటానికి అసలు కారణం దర్గా నుంచి ఎర్రకుంట వైపు వెళ్లే మార్గాన 'శ్మశాన వాటిక' ఉండటమే అని పలువురి అభిప్రాయం.

జన సంచారంతో మరింత ఇరుకు

విస్తరణకు నోచుకోని ఎర్రకుంట ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా దుకాణ సముదాయాలు, పాఠశాలలతో పాటు కూరగాయల సంత ఉంది. పెట్రోల్ బంకులు ఉన్నాయి. దీంతో ఇక్కడ నిత్యం జనసంచారంతో పాటు, వాహనాల రాకపోకలు అధికంగానే ఉంటాయి. ఈ సమయంలో ఇక్కడ రోడ్డు దాటే క్రమంలో బాటసారులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రమాదాలకు నిలయం..

ఇరుకైన ఎర్రకుంట మార్గంలోని ఎస్‌జీఏ గార్డెన్ వద్ద 2013 మార్చి 3న ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో సైకిల్‌పై వెళ్తున్న అబూబకర్ బిన్ అబ్దుల్లా వహ్లన్ (15) మృత్యువాత పడ్డాడు. దీంతో ఆగ్రహించిన స్థానికులు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును ధ్వంసం చేయడమే కాకుండా.. ఆందోళన చేశారు. 2015 ఏప్రిల్ 5న ఎర్రకుంట లిమ్రా హోటల్ ఎదుట ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొన్న ఘటనలో తలాబ్‌కట్టా ఈదిబజార్‌కు చెందిన మహ్మద్ మక్సూద్(18) మృతి చెందాడు. 2022 సెప్టెంబర్ 14న ఎర్రకుంట కల్నల్ స్కూల్ వద్ద లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అద్నాన్ అల్ అన్సార్ అనే డిగ్రీ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. ఎర్రకుంట కూడలి రహదారిపై ఏర్పడిన గోతిలో 2024 జనవరి 4న బైక్ కిడ్ అయి, జారిపడిన గులాబ్ శంషూద్దీన్(45) అనే వ్యక్తిపై నుంచి లారీ పోవడంతో అతను దుర్మరణం పాలయ్యాడు.

రోడ్డును విస్తరించాలి



ఎర్రకుంట శ్మశాన వాటిక నుంచి మర్రి చెట్టు వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి. వాహనాల రాకపోకలతో పాటు జనసంచారం పెరిగింది. అందుకు అనుగుణంగా రహదారి లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అసలే ఇరుకైన దారి, దానికి ఇరువైపులా దుకాణదారుల సామగ్రి ఉండటంతో మరింత ప్రమాదకరంగా మారింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– ఖాజా ఖాన్, వాహనదారుడు

మరమ్మతులు శూన్యం



మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎర్రకుంట చౌరస్తాలో రహదారిపై మురుగు నీరు పారుతోంది. తద్వారా రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. గోతుల కారణంగా నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ నిండు ప్రాణం బలైంది. తొలుత వ్యర్థ జలాల పారుదలను సరిచేసి, రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలి.

– మహ్మద్ ఇస్మాయిల్, తూర్‌కాలని

ఆ మలుపులు.. ప్రమాదాలకు పిలుపు

- రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు
- సూచిక బోర్డులు లేక ప్రమాదాల బారిన వాహనదారులు
- భయాందోళన వ్యక్తంచేస్తున్న బాటసారులు


రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు

మొయినాబాద్ రూరల్: పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు. అవి బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందనేది జగమెరిగిన సత్యం. కానీ ఇక్కడ అభివృద్ధి సంగతి ఎలా ఉన్నా.. కనీస రోడ్డు సౌకర్యం సరిగా లేక గ్రామీణ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇందుకు నిదర్శనం .. మండల పరిధి రహదారుల దుస్థితే.. పల్లెలకు వెళ్లే రహదారులకు పొడవునా ఉన్న మూలమలుపులు ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. అందుకు కారణం స్థానిక పాలకులు, అధికారులే అని వాహనదారులు బాహటంగానే విమర్శిస్తున్నారు. మండల పరిధి ఎన్కేపల్లి, బాకారం తోలుకట్ట నుంచి ఎత్‌బార్‌పల్లి, అమ్డాపూర్ నుంచి కాశింబౌలి, అజీజ్‌నగర్ నుంచి నాగిరెడ్డిగూడ, బాకారం, హిమాయత్‌నగర్ నుంచి చిల్కూర్, పెద్దమంగళారం నుంచి ఎల్కగూడకు వెళ్లే రోడ్లలో సుమారు 15 మలుపులు ఉన్నాయి. అవి కనిపించకుండా రోడ్డు మీదకు ముళ్లపొదలు వచ్చాయి. వాటిని సూచించాల్సిన సూచిక బోర్డులు కూడా పాలక వర్గం ఏర్పాటు చేయించకపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని బాధిత గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉదయం వేళలో ప్రయాణం ఎలా ఉన్నా.. రాత్రి పూట భయాందోళనకు గురిచేస్తుందంటున్నారు.


ఎన్కేపల్లి సమీపంలో సూచికబోర్డు లేని మూలమలుపు

డ్రగ్స్ విక్రేత అరెస్టు

బంజారాహిల్స్: డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. మాసబ్ ట్యాంక్‌లోని ఓ కార్యాలయంలో సిస్టం ఎనలిస్ట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు సన్‌సిటీలో ఉంటున్నాడు. జల్సాలకు అలవాటుపడ్డ ఆయన అక్రమంగా డ్రగ్స్‌ను తీసుకువస్తూ విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్.. సిబ్బందితో కలిసి ఫిలింనగర్‌లోని సినార్‌వ్యాలీ పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. గోవా నుంచి ఈ డ్రగ్‌ను తెప్పించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

ప్రోత్సహిస్తే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు

హఫీజ్‌పేట్: సమాజంలో మహిళలంటే ఇంకా చిన్న చూపు చూసే పరిస్థితులు మారుతున్నా యని, ప్రోత్సహిస్తే ఏ రంగమైనా మహిళలు రాణిస్తారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. రాయదుర్గంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్-2023 ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ వివిధ రంగాలలో అవార్డులు పొందిన మహిళలు అందరికీ ఆదర్శమన్నారు. మహిళలను గౌరవించి.. అన్ని రంగాలలో ముందుకు వెళ్లేలా వారికి తోడ్పాటు అందించాలన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ ఉన్నారు. అవార్డులు పొందినవారిలో డాక్టర్ ఆఫ్ ది ఇయర్‌గా డాక్టర్ కటకం నర్మద, మాన్యుఫ్యాక్చరర్ ఆఫ్ ది ఇయర్‌గా చంద్రికా సతీష్, అథ్లెట్ ఆఫ్ ది ఇయర్‌గా క్రీడాకారిణి పీవీఎం నాగజ్యోతి తదితరులు ఉన్నారు.